# 8 ఇంక్లైన్ కార్మికుల పిల్లలకు ఊరట..

**స్కూల్ బస్సుల సేవల పునరుద్ధరణ**
**యాజమాన్యంతో చర్చించి సమస్య పరిష్కరించాం**
**: ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్ డా. బి. జనక్ ప్రసాద్**

**అగ్నిధార న్యూస్,(రామగుండం):**

8 ఇంక్లైన్ కాలనీలో నివసిస్తున్న సింగరేణి కార్మికుల పిల్లలు గోదావరిఖని, ఎన్టీపీసీ పరిధిలోని పాఠశాలలకు వెళ్లేందుకు వినియోగిస్తున్న స్కూల్ బస్సుల సేవలను పునరుద్ధరించినట్లు ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్ డా. బి. జనక్ ప్రసాద్ తెలిపారు. స్కూల్ బస్సుల కాంట్రాక్టు గడువు ముగియడంతో బస్సుల రాకపోకలు నిలిచిపోయి, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయం తన దృష్టికి రావడంతో వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి



చేసినట్లు ఆయన పేర్కొన్నారు. కార్మికుల పిల్లల విద్యకు ఎలాంటి ఆటంకం కలగకుండా స్కూల్ బస్సుల సేవలను అత్యవసరంగా పునరుద్ధరించాలని యాజమాన్యాన్ని కోరగా, వారు సానుకూలంగా స్పందించి బస్సులను తిరిగి నడిపేందుకు నిర్ణయం తీసుకున్నారని వెల్లడించారు. దీంతో 8 ఇంక్లైన్ కాలనీలకు చెందిన విద్యార్థులు మళ్లీ సకాలంలో పాఠశాలలకు వెళ్లే అవకాశం లభించిందని, సంబంధిత కార్మిక కుటుంబాలు ఈ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

కార్మికుల సమస్యల పరిష్కారంలో ఐఎన్‌టీయూసీ ఎల్లప్పుడూ ముందుంటుందని, వారి హక్కులు, సంక్షేమం కోసం నిరంతరం పోరాడుతూనే ఉంటుందని డా. బి. జనక్ ప్రసాద్ స్పష్టం చేశారు. కార్మిక కుటుంబాల సంక్షేమం, వారి పిల్లల విద్యాభివృద్ధికి సంస్థ ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు.

# కొమురవెల్లిలో తెలంగాణ సంస్కృతి మహోత్సవం ఘన విజయం

**జాతీయస్థాయి స్వర్ణ నంది అవార్డ్స్--2026కు విశేష స్పందన**
**డాక్టర్ ఉప్పు రవీందర్ పటేల్--పద్మ దంపతుల ఆధ్వర్యంలో**
**సాంస్కృతిక వైభవం**

**అగ్ని ధార న్యూస్ ,(కొమురవెల్లి):**

తెలంగాణ జానపద కళలు, గ్రామీణ సంస్కృతి, యువత ప్రతిభ, సేవా స్ఫూర్తిని ఒకే వేదికపై ఆవిష్కరించిన "తెలంగాణ సంస్కృతి--యువత భవిష్యత్ జాతీయస్థాయి స్వర్ణ నంది అవార్డ్స్--2026" కార్యక్రమం కొమురవెల్లిలో అంగరంగ వైభవంగా జరిగింది. వెయ్యిమందికి పైగా కళాభిమానులు, భక్తులు, ప్రముఖులు హాజరైన ఈ మహోత్సవం రాష్ట్రవ్యాప్తంగా విశేష ఆదరణ పొందింది. వేద రూరల్ పీపుల్ ఎడ్యుకేషన్ డెవలప్మెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు, శ్రీ మల్లికార్జున స్వామి అఖిలభారత మున్నూరు కాపు నిత్య అన్నదాన సత్రం వ్యవస్థాపక చైర్మన్ డాక్టర్ ఉప్పు రవీందర్ పటేల్, పద్మ దంపతుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమం తెలంగాణ కళా వైభవాన్ని ప్రతిబింబించే వేదికగా నిలిచింది. కొమురవెల్లి శ్రీ మల్లికార్జున స్వామి మున్నూరు కాపు ఏసీ బ్యాంకెట్ హాల్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమం ఉదయం జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభమై రాత్రి వరకు కొనసాగింది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్ర రాష్ట్రాల నుంచి వచ్చిన సుమారు 500 మంది కళాకారులు తమ ప్రతిభను ప్రదర్శించారు. ఒగ్గు కథలు, బోనాల ఆటపాటలు, బతుకమ్మ, కోలాటం, చిరుతనాట్యం, జానపద గేయాలు, భరతనాట్యం, అన్నమయ్య కీర్తనలు, సంగీత--సాహిత్య కార్యక్రమాలు సభికులను అలరించాయి. తెలంగాణ సంస్కృతి వైవిధ్యాన్ని ప్రతిబింబించే కళారూపాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ సందర్భంగా వివిధ రంగాల్లో



విశేష సేవలందించిన కళాకారులు, సామాజిక సేవకులు, మీడియా ప్రతినిధులకు జాతీయస్థాయి స్వర్ణ నంది అవార్డులు, ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. విజేతలకు రూ.5,116 నుంచి రూ.1,116 వరకు నగదు బహుమతులను అందజేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న తెలంగాణ స్టేట్ ఫైనాన్స్ కమిషన్ చైర్మన్, మాజీ ఎంపీ సిరిసిల్ల రాజయ్య మాట్లాడుతూ, తెలంగాణ జానపద కళలు దేశ సంస్కృతికి మూలస్తంభాలని పేర్కొన్నారు. గ్రామీణ కళాకారులను ప్రోత్సహించడంలో డాక్టర్ ఉప్పు రవీందర్ పటేల్ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. తెలంగాణ రాష్ట్ర ఫుడ్ కమిషన్ సభ్యులు ఓరుగంటి ఆనంద్, టీపీసీసీ ఓబీసీ విభాగం రాష్ట్ర కన్వీనర్ కే. వెంకటేష్, మున్నూరు కాపు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పుట్ట పురుషోత్తం రావు పటేల్ తదితరులు మాట్లాడుతూ, తెలంగాణ సంస్కృతిని ప్రపంచానికి చాటిచెప్పడంలో ఇలాంటి కార్యక్రమాలు కీలక పాత్ర పోషిస్తాయని అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా డాక్టర్ ఉప్పు రవీందర్ పటేల్ మాట్లాడుతూ, తెలంగాణ జానపద కళలను పరిరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. కళాకారులను ఆర్థికంగా ప్రోత్సహించాలనే ఉద్దేశంతో స్వంత నిధులతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. కళాకారుల ఆనందమే తనకు అతిపెద్ద పురస్కారమని పేర్కొన్నారు. దాదాపు 20 టెలివిజన్ ఛానళ్లలో ప్రత్యక్ష ప్రసారం చేసిన ఈ కార్యక్రమం రాష్ట్రవ్యాప్తంగా విశేష ఆదరణ పొందింది. పాల్గొన్న ప్రతి ఒక్కరికీ అన్నదాన సత్రం ఆధ్వర్యంలో భోజన సదుపాయాలు కల్పించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. సంస్కృతి, సేవ, కళ, సాహిత్యం, జానపద వైభవం సమ్మిళితమైన ఈ జాతీయస్థాయి స్వర్ణ నంది అవార్డ్స్--2026 మహోత్సవం కొమురవెల్లి చరిత్రలో చిరస్మరణీయంగా నిలిచిపోతుందని పలువురు అభిప్రాయపడ్డారు.

# క్రిటికల్ కేర్ భవనం.. అత్యవసర వైద్యం కోసమా? బిల్లుల కోసమా?

**గోదావరిఖని ఏరియా ఆసుపత్రిలో సౌకర్యాలు కల్పించాలని ఫైట్ ఫర్ బెటర్ సొసైటీ డిమాండ్**

**అగ్నిధార న్యూస్,(రామగుండం):**

గోదావరిఖని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో క్రిటికల్ కేర్ భవనంలో కనీస సౌకర్యాలు కల్పించి, అత్యవసర వైద్య సేవలను మెరుగుపర్చాలని ఫైట్ ఫర్ బెటర్ సొసైటీ అధ్యక్షుడు మద్దెల దినేష్ డిమాండ్ చేశారు. సోమవారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన పలు అంశాలను ప్రస్తావించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, క్రిటికల్ కేర్ భవనం నిర్మాణం అత్యవసర వైద్య సేవల విస్తరణ కోసం చేపట్టినప్పటికీ, అవసరమైన పరికరాలు, అనుభవజ్ఞులైన వైద్య బృందం, తగిన సిబ్బంది లేకపోవడం వల్ల రోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆరోపించారు. వెంటనే అన్ని సౌకర్యాలను ఏర్పాటు చేసి సమర్థవంతమైన వైద్య సేవలు అందించాలని కోరారు. ఇంత పెద్ద పారిశ్రామిక ప్రాంతమైన గోదావరిఖనిలో టి-హబ్ డయాగ్నస్టిక్స్ కేంద్రం లేకపోవడం వల్ల ప్రజలు పరీక్షల కోసం జిల్లా కేంద్రానికి వెళ్లాల్సి వస్తోందని పేర్కొన్నారు. ఏరియా ఆసుపత్రిలోనే టి-హబ్ డయాగ్నస్టిక్స్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

ఆసుపత్రికి అనుభవం, నిజాయితీ కలిగిన వ్యక్తిని సూపరింటెండెంట్‌గా నియమించేందుకు వైద్య విద్యా సంచాలకులు (డీఎంఈ) పునరాలోచించాలని కోరారు. ఆసుపత్రిలో శానిటేషన్, సెక్యూరిటీ, పేషెంట్ కేర్ విభాగాలను




నిర్వహిస్తున్న కాంట్రాక్ట్ సంస్థల పనితీరుపై కూడా ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు. సెక్యూరిటీ విభాగంలో పనిచేస్తున్న ఓ వ్యక్తి సిబ్బందిని మానసికంగా వేధిస్తున్నాడని ఆరోపిస్తూ, దీనిపై సమగ్ర విచారణ జరిపి అవసరమైతే సంబంధిత కాంట్రాక్ట్ సంస్థపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో ఎంఆర్ఐ స్కాన్ కేంద్రం, ఆర్వో వాటర్ ప్లాంట్, ఏటీఎం సెంటర్, ఉచిత మృతదేహ వాహనాలు, ఆధునిక ఫ్రీజర్లను ఏర్పాటు చేయాలని ఆయన కోరారు. స్థానిక ఎమ్మెల్యే, జిల్లా కలెక్టర్ ప్రత్యేక దృష్టి సారించి ఆసుపత్రి అభివృద్ధికి చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. అయితే, ఈ ఆరోపణలు, డిమాండ్లపై సంబంధిత అధికారుల స్పందన తెలియాల్సి ఉంది.

# ఉపాధిని దెబ్బతీసే ప్రైవేట్ ఏజెన్సీల విధానాన్ని రద్దు చేయాలి

**రామగుండం బల్దియా నిర్ణయంపై సమత సైనిక్ దళ్ ధ్వజం**

**అగ్నిధార న్యూస్,( రామగుండం):**

రామగుండం నగరపాలక సంస్థ పరిధిలో ఇంటింటా చెత్త సేకరించే బాధ్యతలను స్థానిక కార్మికులను కాదని ప్రైవేట్ ఏజెన్సీలకు అప్పగించడాన్ని సమత సైనిక్ దళ్ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ మార్వల్ దుర్గం నగేష్ తీవ్రంగా ఆక్షేపించారు. బల్దియా నూతనంగా ప్రవేశపెట్టిన 'డ్రైవర్ కం ఆపరేటర్' పాలసీ వల్ల ఎన్నో ఏళ్లుగా ఇదే వృత్తిపై ఆధారపడి బతుకుతున్న వందలాది మంది నిరుపేద ర్యాగ్ పిక్కర్ల (చెత్త ఏరుకునే కార్మికులు) పొట్టగొట్టడమేనని ఆయన మండిపడ్డారు.

ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. హైదరాబాద్, వరంగల్ వంటి మహానగరాల తరహాలో రామగుండంలోనూ ప్రైవేట్ ఏజెన్సీల ద్వారా చెత్త సేకరించాలనే నిర్ణయం ఇక్కడి పరిస్థితులకు ఏమాత్రం సరిపోదన్నారు. నగరంలోని 7 డివిజన్లలో (34, 40, 47, 49, 51, 52, 60) పైలట్ ప్రాజెక్టు పేరుతో టెండర్ల ద్వారా ఎంపిక చేసిన ప్రైవేట్ ఏజెన్సీకి బాధ్యతలు అప్పగించడం వెనుక ఉన్న అంతర్యమేమిటని ఆయన ప్రశ్నించారు. ?దశాబ్దాలుగా మురికివాడల్లో నివసిస్తూ, సమాజంలో అత్యంత వెనుకబడిన మాల, మాదిగ, వడ్డెర వంటి వర్గాలకు చెందిన వారే ఈ చెత్త సేకరణ వృత్తిలో ఎక్కువగా ఉన్నారని, ఈ రోజు వారి ఉపాధిని లాగేసుకోవడం అన్యాయమని ఆవేదన వ్యక్తం చేశారు. బల్దియా అధికారులు




కార్పొరేషన్‌కు ఆర్థిక భారం తగ్గుతుందనే కుంటిసాకులతో ప్రైవేట్ సంస్థలకు లాభాలు చేకూర్చేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ?బల్దియా కార్యాలయం ఎదుట పారిశుధ్య కార్మికులు, ర్యాగ్ పిక్కర్లు చేపట్టిన ఆందోళనకు సమత సైనిక్ దళ్ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తోందని నగేష్ స్పష్టం చేశారు. అధికారులు, పాలకులు పునరాలోచన చేసి తక్షణమే ఈ ఏజెన్సీ విధానాన్ని ఉపసంహరించుకోవాలని, లేనిపక్షంలో బాధితుల పక్షాన పెద్ద ఎత్తున ఉపాధి పరిరక్షణ ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

## కాశీ విశ్వేశ్వర స్వామి ఆశీస్సులతో రాష్ట్రం సుభిక్షంగా ఉండాలి



**పవర్ హౌస్ కాలనీలో శివాలయాన్ని సందర్శించిన మనాలి ఠాకూర్**

**అగ్నిధార న్యూస్,( రామగుండం):**

రామగుండం పవర్ హౌస్ కాలనీలోని శ్రీ కాశీ విశ్వేశ్వర శివాలయాన్ని రామగుండం ఎమ్మెల్యే ఎంఎస్ రాజ్ ఠాకూర్ సతీమణి మనాలి ఠాకూర్ సోమవారం సందర్శించారు.

ఈ సందర్భంగా పరమేశ్వరుడికి ప్రత్యేక పూజలు నిర్వహించిన ఆమె, రాష్ట్ర ప్రజలందరూ సుఖశాంతులు, ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రార్థించారు. రామగుండం నియోజకవర్గం అన్ని రంగాల్లో మరింత అభివృద్ధి చెందాలని, ప్రజల జీవితాల్లో సుభిక్షం వెల్లివిరియాలని ఆకాంక్షించారు. అనంతరం ఆలయ అర్చకులు వేదమంత్రోచ్ఛారణల మధ్య మనాలి ఠాకూర్‌కు వేదాశీర్వచనం అందించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. భక్తిశ్రద్ధలతో ఆలయాన్ని సందర్శించిన ఆమెకు ఆలయ కమిటీ సభ్యులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఆధ్యాత్మిక చింతన సమాజంలో శాంతి, సామరస్యానికి దోహదపడుతుందని అన్నారు. ఆలయాలు మన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకలని, వాటి పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక ప్రజాప్రతినిధులు, మహిళలు, భక్తులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## వేల్పులమ్మ అమ్మవారి ఆశీస్సులతో ప్రజలంతా సుఖశాంతులతో ఉండాలి

**విగ్రహ పునఃప్రతిష్ఠ మహోత్సవంలో పాల్గొన్న మనాలి ఠాకూర్**

**అగ్నిధార న్యూస్,( రామగుండం):**

రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 36వ డివిజన్‌లో ఉన్న శ్రీ వేల్పులమ్మ దేవస్థానంలో నిర్వహించిన అమ్మవారి విగ్రహ పునఃప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమంలో ఎమ్మెల్యే ఎంఎస్ రాజ్ ఠాకూర్ సతీమణి మనాలి ఠాకూర్ పాల్గొన్నారు. సోమవారం ఆలయ అర్చకులు వేదమంత్రోచ్ఛారణల మధ్య ప్రత్యేక పూజలు నిర్వహించగా, మనాలి ఠాకూర్ భక్తిశ్రద్ధలతో అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో ఉండాలని, రామగుండం నియోజకవర్గం అన్ని రంగాల్లో మరింత అభివృద్ధి చెందాలని అమ్మవారిని ప్రార్థించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఆధ్యాత్మిక కార్యక్రమాలు సమాజంలో ఐక్యత, సాంస్కృతిక విలువలను పెంపొందిస్తాయని అన్నారు. ఆలయాల అభివృద్ధికి, భక్తులకు మెరుగైన సౌకర్యాల కల్పనకు తమవంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని తెలిపారు. అమ్మవారి విగ్రహ పునఃప్రతిష్ఠ కార్యక్రమం భక్తిశ్రద్ధల మధ్య వైభవంగా సాగింది. ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు మనాలి ఠాకూర్‌కు ఘన స్వాగతం పలికి సన్మానించారు. ఆలయ అభివృద్ధికి ప్రజల సహకారం అభినందనీయమని ఆమె పేర్కొన్నారు.

అనంతరం స్థానిక ప్రజలు, మహిళలు, యువతను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సంక్షేమం కోసం నిరంతరం కృషి చేయడమే ఎమ్మెల్యే ఎంఎస్ రాజ్ ఠాకూర్ లక్ష్యమని, అదే స్ఫూర్తితో సేవా కార్యక్రమాలను కొనసాగిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, 36వ డివిజన్ అధ్యక్షులు, మహిళా కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, ఆలయ కమిటీ సభ్యులు, కార్యకర్తలు, మహిళలు, యువతతో పాటు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## ఎల్లమ్మ అమ్మవారి ఆశీస్సులతో ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలి

**బోనాల జాతరలో పాల్గొన్న మనాలి ఠాకూర్**

**అగ్నిధార న్యూస్ ,(రామగుండం):**

రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 39వ డివిజన్ శివాజీనగర్ కూరగాయల మార్కెట్‌లో నిర్వహించిన శ్రీ ఎల్లమ్మ అమ్మవారి బోనాల జాతరలో రామగుండం ఎమ్మెల్యే ఎంఎస్ రాజ్ ఠాకూర్ సతీమణి మనాలి ఠాకూర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించిన ఆమె, ప్రజలందరూ సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో జీవించాలని ప్రార్థించారు. అమ్మవారి కృపతో ప్రతి కుటుంబంలో శాంతి, సుభిక్షం వెల్లివిరియాలని ఆకాంక్షించారు. అనంతరం ఎల్లమ్మ అమ్మవారి ఆలయ నిర్మాణం పూర్తై 19 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఆలయ నిర్వాహక కమిటీ సభ్యులకు, భక్తులకు ఆమె శుభాకాంక్షలు తెలిపారు. ఆలయ అభివృద్ధికి కృషి చేస్తున్న కమిటీ సభ్యులను అభినందిస్తూ, భక్తుల సహకారంతో ఆలయం మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బోనాల పండుగ సామాజిక ఐక్యతకు నిదర్శనమని ఆమె పేర్కొన్నారు. ప్రజలు సంప్రదాయాలను పరిరక్షించుకుంటూ భక్తిశ్రద్ధలతో పండుగలను నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక కార్పొరేటర్, ప్రజాప్రతినిధులు, మహిళలు, భక్తులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## రాజకీయ ఖైదీలను బేషరతుగా విడుదల చేయాలి

**మావోయిస్టు సంబంధాల పేరుతో నమోదైన**
**కేసులను ఎత్తివేయాలని అఖిలపక్ష సమావేశం డిమాండ్**

**అగ్నిధార న్యూస్,( రామగుండం):**

మావోయిస్టు రాజకీయ ఖైదీలను బేషరతుగా విడుదల చేయడంతో పాటు, మావోయిస్టులతో సంబంధాలున్నాయనే ఆరోపణలపై నమోదైన కేసులను ఎత్తివేయాలని పౌరహక్కుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన అఖిలపక్ష రౌండ్‌టేబుల్ సమావేశం డిమాండ్ చేసింది. సోమవారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రం షోయబ్ హాల్‌లో జరిగిన ఈ సమావేశంలో వివిధ వామపక్ష పార్టీలు, ప్రజాసంఘాల నాయకులు, న్యాయవాదులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పౌరహక్కుల సంఘం అధ్యక్షుడు డాక్టర్ లక్ష్మణ్ మాట్లాడుతూ, దేశవ్యాప్తంగా, తెలంగాణలో మావోయిస్టులనే ఆరోపణలతో అనేక మంది సంవత్సరాలుగా జైళ్లలో మగ్గుతున్నారని పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మావోయిస్టు ఉద్యమం అంతరించిపోయిందని ప్రకటిస్తున్న నేపథ్యంలో, అదే ఉద్యమానికి సంబంధించిన ఆరోపణలతో సాధారణ కార్యకర్తలు, సానుభూతిపరులను జైళ్లలో కొనసాగించడం అన్యాయమని అభిప్రాయపడ్డారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా రాజకీయ ఖైదీల విడుదలపై ప్రభుత్వాలు ప్రత్యేక చొరవ చూపాలని ఆయన కోరారు. తీవ్రమైన అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న పలువురు ఖైదీల పరిస్థితిని దృష్టిలో ఉంచుకొని మానవతా దృక్పథంతో వ్యవహరించాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో మాట్లాడిన న్యూడెమోక్రసీ నాయకులు దామోదర్, తెలంగాణ జైళ్లలో సుమారు 50 మంది మావోయిస్టులనే ఆరోపణలతో నిర్బంధంలో ఉన్నారని, వీరిలో అధికశాతం ఆదివాసీలేనని పేర్కొన్నారు. భాషా సమస్యలు, కుటుంబ సభ్యుల మూలాకాత్‌లకు ఇబ్బందులు వంటి కారణాలతో వారు అదనపు కష్టాలను ఎదుర్కొంటున్నారని తెలిపారు. పౌరహక్కుల సంఘం నాయకుడు ఎన్. నారాయణరావు మాట్లాడుతూ, దేశవ్యాప్తంగా వివిధ జైళ్లలో ఉన్న రాజకీయ ఖైదీలలో అనేక మంది వృద్ధాప్యం, అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారని చెప్పారు. పలువురు విచారణ ఖైదీలుగా సంవత్సరాల తరబడి జైళ్లలోనే ఉన్నారని, వారి విడుదలపై ప్రజాసంఘాలు దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. మాస్‌లైన్ నాయకులు రామచంద్ర, హన్మేష్ మాట్లాడుతూ, రాజకీయ భేదాభిప్రాయాలకు అతీతంగా ఖైదీల మానవ హక్కులను పరిరక్షించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకువచ్చి విడుదలకు మార్గం సుగమం చేయాలని సూచించారు. ఈ సందర్భంగా రెండు తెలుగు రాష్ట్రాల్లోని రాజకీయ ఖైదీల విడుదల కోసం 'రాజకీయ ఖైదీల విడుదల కమిటీ' పేరిట ఐక్య వేదికను ఏర్పాటు చేసి, ఉమ్మడి పోరాటాన్ని కొనసాగించాలని సమావేశం తీర్మానించింది. ప్రజాసంఘాలు, మేధావులు, సామాజిక కార్యకర్తలు కలిసి పనిచేస్తే లక్ష్య సాధన సాధ్యమవుతుందని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు.

# హరితోద్యమం విజయవంతం చేయాలి.. కుటుంబ విలువలను కాపాడాలి

**శ్రీ చైతన్య స్కూల్‌లో ఘనంగా హరితోద్యమం, ఫాదర్స్ డే వేడుకలు**
**ముఖ్య అతిథిగా బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కందుల సంధ్యారాణి**



**అగ్నిధార న్యూస్,(రామగుండం):**

పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, భావితరాలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించాలంటే హరితోద్యమ కార్యక్రమాలను విజయవంతం చేయాలని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కందుల సంధ్యారాణి పిలుపునిచ్చారు. రామగుండం సప్తగిరి కాలనీలోని శ్రీ చైతన్య టెక్నో స్కూల్‌లో ఆదివారం నిర్వహించిన హరితోద్యమం, ఫాదర్స్ డే వేడుకలకు ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో భాగంగా పాఠశాల ఆవరణలో మొక్కలు నాటి హరితోద్యమానికి శ్రీకారం చుట్టారు. అనంతరం నిర్వహించిన ఫాదర్స్ డే వేడుకల్లో పాల్గొని విద్యార్థులు, తల్లిదండ్రులను ఉద్దేశించి ప్రసంగించారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రతి కుటుంబం కనీసం ఒక మొక్కను నాటి దానిని సంరక్షించే బాధ్యత తీసుకోవాలని సూచించారు. చెట్లు మన జీవనాధారమని, పర్యావరణ సమతుల్యతను కాపాడేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని అన్నారు. ఫాదర్స్ డే ప్రాముఖ్యతను వివరిస్తూ, పిల్లల వ్యక్తిత్వ వికాసంలో తండ్రి పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు. తల్లిదండ్రులను గౌరవించడం ప్రతి బిడ్డ బాధ్యత అని, కుటుంబ విలువలను అలవర్చుకొని సమాజానికి ఆదర్శంగా నిలవాలని విద్యార్థులకు సూచించారు.

ఈ సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన, చిత్రలేఖన పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు కందుల సంధ్యారాణి చేతుల మీదుగా బహుమతులు ప్రదానం చేసి అభినందించారు. విద్యార్థులు విద్యతో పాటు సృజనాత్మకతను పెంపొందించుకోవాలని, ఇటువంటి పోటీలు వారి వ్యక్తిత్వ వికాసానికి దోహదపడతాయని ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు తడగొండ నరసయ్య, బియ్యాల మహేందర్, శ్రీ చైతన్య టెక్నో స్కూల్ రామగుండం బ్రాంచ్ ఏజీఎం అరవింద్ రెడ్డి, ప్రిన్సిపాల్ శివకీర్తి, అనిల్ కుమార్, స్వప్న, పూజ, పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# వ్యక్తిత్వ వికాసం, భద్రతపై అవగాహనతో నవభారత నిర్మాణం సాధ్యం

**ఇంపాక్ట్ ఫౌండేషన్ డా. గంప నాగేశ్వరరావు**

**అగ్నిధార న్యూస్,(రామగుండం):**

సమాజంలో వ్యక్తిత్వ వికాసం, భద్రతపై అవగాహన పెంపొందించడం ద్వారా నవభారత నిర్మాణానికి బలమైన పునాదులు వేయవచ్చని ఇంపాక్ట్ ఫౌండేషన్ సృష్టికర్త డాక్టర్ గంప నాగేశ్వరరావు అన్నారు. 30 రోజుల పాటు నిర్వహించిన ఆన్‌లైన్ శిక్షణతో పాటు రెండు రోజుల ప్రత్యేక వర్క్‌షాప్‌ను విజయవంతంగా పూర్తి చేసుకున్న డాక్టర్ దేవి లక్ష్మీ నరసయ్య, న్యాయవాది ఎం. వరలక్ష్మి ఇంపాక్ట్ సర్టిఫైడ్ ట్రైనర్లుగా గుర్తింపు పొందిన సందర్భంగా ఆయన అభినందనలు తెలిపారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సమాజంలో సానుకూల మార్పులు తీసుకురావడంలో శిక్షణ పొందిన ట్రైనర్ల పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసం, నాయకత్వ లక్షణాలు, సైబర్ భద్రత, మహిళా రక్షణ, సామాజిక బాధ్యతలపై అవగాహన కల్పించడం అత్యంత అవసరమన్నారు. నేటి పోటీ ప్రపంచంలో విద్యతో పాటు విలువలు, నైతికత, స్వీయ రక్షణ పట్ల అవగాహన కలిగి ఉండటం యువతకు ఎంతో అవసరమని చెప్పారు. ఈ దిశగా ఇంపాక్ట్ ఫౌండేషన్ చేపడుతున్న శిక్షణా కార్యక్రమాలు సమాజ నిర్మాణంలో కీలక పాత్ర పోషిస్తున్నాయని వివరించారు. శిక్షణ పూర్తి చేసుకున్న డాక్టర్ దేవి లక్ష్మీ నరసయ్య, న్యాయవాది ఎం. వరలక్ష్మి తమకు లభించిన జ్ఞానం, అనుభవాన్ని సమాజానికి ఉపయోగపడేలా వినియోగించి, యువతలో వ్యక్తిత్వ వికాసం, భద్రతపై చైతన్యం తీసుకురావాలని డాక్టర్ గంప నాగేశ్వరరావు సూచించారు. సమాజాభివృద్ధికి ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతను నిర్వర్తించినప్పుడే అభివృద్ధి చెందిన నవభారత నిర్మాణం సాధ్యమవుతుందని ఆయన పేర్కొన్నారు.



# ఎలక్ట్రిసిటీ ఏఈ పై ఫిర్యాదు

**కలెక్టర్ లాగిన్ లో పెండింగ్ లో ఉన్న ఇందిరమ్మ ఇండ్లకు ప్రొసిడింగ్స్ ఇవ్వాలి.**
**తిమ్మాపూర్ సర్పంచ్ పోసాన్ పల్లి రాజు.**
**కలెక్టర్ ప్రజావాణి లో వినతి.**

**అగ్నిధార న్యూస్ సిద్దిపేట జిల్లా**

గజ్వేల్ నియోజకవర్గం జగదేవపూర్ మండలంలో సమస్యలు పరిష్కరించకుండా నిర్లక్ష్యం వహిస్తున్న ఎలక్ట్రిసిటీ ఏఈ జగదేవపూర్ పైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ లాగిన్ లో పెండింగ్ లో ఉన్న ఇందిరమ్మ ఇండ్లకు ప్రొసీడింగ్స్ ఇవ్వాలని జిల్లా కలెక్టర్ కార్యాలయం ప్రజావాణిలో తిమ్మాపూర్ సర్పంచ్ పోసాన్ పల్లి రాజు వట్టిపల్లి ఉప సర్పంచ్ బోనకొల్లూరు నాగరాజు వార్డు మెంబెర్ కొలనుపాక రాములు వినతి ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పేదలకు ఇందిరమ్మ ఇండ్లు ఇచ్చే పథకం లో ఇల్లు సర్వే చేసినప్పుడు అర్హులు అయిన పేదల పేర్లు ఎల్3 లోకి వెళ్లడం వల్ల వారికి ఇల్లు రాకుండా అయింది ఈ విషయంలో ఎంపీడీవోకి జిల్లా కలెక్టర్ కి దరఖాస్తులు ఇచ్చినప్పటికీ వాటిని జస్టిఫికేషన్ రిపోర్ట్ రాసి



కలెక్టర్ లాగిన్ లో పెండింగ్లో ఉన్నవి వాటిని ఇప్పటివరకు ప్రొసీడింగ్స్ ఇవ్వలేదు వాటికి వెంటనే ప్రెసిడెంట్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. జగదేవపూర్ మండలం ఎలక్ట్రిసిటీ ఏఈ గ్రామాల్లో ఉన్నటువంటి సమస్యలను పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు తిమ్మాపూర్ గ్రామంలో ఇండ్ల పై నుండి త్రీఫేస్ లైను పోవడం వల్ల కరెంట్ షాక్ రావడం జరిగింది. అలాగే రోడ్డు పక్కన ఉన్న కరెంటు స్తంభం కేవలం తీగల మీద ఆధారంతోటి ఉంది. అది పక్కన ఉన్న డి టి ఆర్ పైన పడితే ఇండ్లలో కరెంట్ షాక్ వచ్చేటటువంటి ప్రమాదం ఉంది. ఈ విషయాన్ని గత మూడు నెలల నుంచి చెబుతున్నప్పటికీ డిఇ కి దరఖాస్తు ఇచ్చినప్పటికీ పరిష్కారం చేయలేదని వట్టిపల్లి గ్రామంలో సింగిల్ ఫేస్ లైన్ ఇండ్ల పైన ఉన్నటువంటి లైను తీయమని ఎన్నిసార్లు కోరిన పట్టించుకోవడం లేదు . ఏఈ కనీసం గ్రామాలను తిరిగి సమస్యలు ఏంటి అని ఐడెంటిఫై చేయలేకపోతున్నాడు కాబట్టి మండల్ నుండి తొలగించాలని డిమాండ్ చేశారు. ఎస్పీ స్పందించి సమస్యలను వెంటనే పరిష్కారం చేస్తూ నిర్లక్ష్యం వహిస్తున్న అధికారుల పైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో దుబాసి సుధాకర్, కె సురేష్ పైసా స్వామి గుంద్రు స్వామి తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ పెద్దమ్మ తల్లి ఆశీర్వాదంతో గ్రామ ప్రజలు పాడి పంటలతో చల్లగా ఉండాలి

**విగ్రహా ప్రతిష్ఠాలో పాల్గొన్న ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి**

**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)**

ఆమనగల్ మండలం కోనాపూర్ గ్రామంలో ఘనంగా నిర్వహించిన శ్రీ శ్రీ శ్రీ పెద్దమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం కార్యక్రమానికి ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు టాస్క్ సి ఓ ఓ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించిన అనంతరం మాట్లాడుతూ, అమ్మవారి ఆశీస్సులతో గ్రామ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని ఆకాంక్షించారు, గ్రామ దేవాలయాలు ఆధ్యాత్మికతకు, సామాజిక ఐక్యతకు ప్రతీకలని పేర్కొంటూ, ఆలయ అభివృద్ధికి తన వంతు సహకారంగా 1,00,000 ఒక లక్ష రూపాయలు విరాళాన్ని ఆలయ కమిటీకి అందజేశారు, భవిష్యత్తులో కూడా ఆలయాల అభివృద్ధికి తన సహకారం ఎల్లప్పుడూ కొనసాగుతుందని హామీ ఇచ్చారు,ఈ సందర్భంగా



ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి సహాయం కోరగానే వెంటనే స్పందించి 1,00,000 విరాళం అందించిన సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి కి హృదయ పూర్వక కృతజ్ఞతలు తెలిపారు,ఆయన అందించిన ఆర్థిక సహాయం ఆలయ అభివృద్ధికి ఎంతో దోహదపడుతుందని పేర్కొంటూ, అమ్మవారి ఆశీస్సులతో ఆయన మరిన్ని ఉన్నత స్థానాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో,సర్పంచ్ శ్రీలత సైదులు, ఉప సర్పంచ్ రమేష్ గౌడ్, వార్డు సభ్యులు శివ, శ్రీనాథ్, మల్లేష్,రాంనుంతల మాజీ సర్పంచ్ రచ్చ శ్రీరాములు,ఆలయ కమిటీ సభ్యులు కిష్టయ్య, రమేష్, మల్లేష్, జగన్, శ్రీను, గణేష్, రాజు, సైదులు, భాస్కర్, తిరుపతయ్య, గ్రామ పెద్దలు, మహిళలు, యువత, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## సింగరేణి కార్మిక సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలి



**ముఖ్యమంత్రి నూతన ప్రధాన కార్యదర్శి ఎన్. శ్రీధర్‌ను కలిసిన డా. బి. జనక్ ప్రసాద్**

**అగ్ని ధార న్యూస్,(హైదరాబాద్):**

సింగరేణి సంస్థలో నెలకొన్న ప్రస్తుత పరిస్థితులు, కార్మికుల సంక్షేమానికి సంబంధించిన అంశాలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని తెలంగాణ రాష్ట్ర కనీస వేతన సలహా మండలి చైర్మన్ డాక్టర్ బి. జనక్ ప్రసాద్ అభిప్రాయపడ్డారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నూతన ప్రధాన కార్యదర్శి (ప్రిన్సిపల్ సెక్రటరీ)గా బాధ్యతలు స్వీకరించిన ఐఏఎస్ అధికారి ఎన్. శ్రీధర్‌ను సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర పరిపాలనలో ఆయన సమర్థవంతమైన సేవలు అందించి ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేయాలని ఆకాంక్షించారు. అనంతరం సింగరేణి సంస్థలో ప్రస్తుతం కొనసాగుతున్న పరిస్థితులు, కార్మికుల హక్కులు, సంక్షేమ పథకాలు, ఉపాధి భద్రత, వేతనాలు, కార్మిక సంక్షేమానికి సంబంధించిన పలు కీలక అంశాలపై వారితో విస్తృతంగా చర్చించినట్లు తెలిపారు. సింగరేణి సంస్థ తెలంగాణ ఆర్థికాభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తోందని, వేలాది మంది కార్మికుల జీవనాధారంగా నిలుస్తోందని డా. జనక్ ప్రసాద్ పేర్కొన్నారు. సంస్థ అభివృద్ధితో పాటు కార్మికుల సంక్షేమానికి సమాన ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. ముఖ్యంగా కార్మికుల సమస్యల పరిష్కారం, భద్రతా ప్రమాణాల అమలు, సంక్షేమ కార్యక్రమాల విస్తరణ వంటి అంశాలపై ప్రభుత్వం మరింత దృష్టి కేంద్రీకరించాలని సూచించారు. కార్మిక సంక్షేమం, కనీస వేతనాల అమలు, ఉపాధి రక్షణ వంటి అంశాల్లో ప్రభుత్వం సానుకూల చర్యలు తీసుకుంటే పారిశ్రామిక అభివృద్ధికి మరింత ఊతమిస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. రాష్ట్ర అభివృద్ధి లక్ష్యాల సాధనలో కార్మిక వర్గం భాగస్వామ్యాన్ని బలోపేతం చేయడం అత్యంత అవసరమని పేర్కొన్నారు. ఈ భేటీ సందర్భంగా సింగరేణి ప్రాంత కార్మికుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం సహకారం అందిస్తుందనే ఆశాభావాన్ని డా. బి. జనక్ ప్రసాద్ వ్యక్తం చేశారు.

## విద్యార్థులకు నోటుబుక్కుల పంపిణీ



**అగ్నిధార న్యూస్ కమనూర్**

సోమవారం కమానూర్ మండలంలోని జూలపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన ఒక కార్యక్రమంలో జులపెల్లి గ్రామ ఉపసర్పంచ్ రాజ మహేందర్ 4000 రూపాయల విలువైన నోటుబుక్కులను విద్యార్థులకు అందజేశారు ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు గంగారం,నాగరాజు, శిరోమణి, శ్రీదేవి ,శ్రీలక్ష్మి వేణుగోపాల్ మరియు వార్డ్ మెంబర్ సంతోష్ పోషకులు శ్రీనివాస్, కొమురయ్యలు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశం



**అగ్నిధార న్యూస్ సిద్దిపేట జిల్లా**

గజ్వేల్ నియోజకవర్గం జగదేవపూర్ మండలం లోని పలుగు గడ్డ గ్రామంలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ గృహ నిర్మాణ పథకంలో భాగంగా లబ్ధిదారులు నర పుష్ప కనకయ్య నూతనంగా నిర్మించుకున్న ఇందిరమ్మ ఇళ్లు ను ఎంపిడిఓ వేణుగోపాల్ రెడ్డి,సర్పంచ్ నర్ర కనకయ్య మంగళవారం ప్రారంభించారు. అనంతరం లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... పేద కుటుంబాలకు సొంత ఇంటి కలను సహకారం చేస్తూ ప్రభుత్వం చేపట్టిన ఇందిరాబాదు పథకం గ్రామీణ ప్రాంతాల్లో ఎంతోమందికి ప్రయోజనం చేకూరుస్తుందని వారి పేర్కొన్నారు. ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం చేపట్టి మొదటి విడతలో మంజూరైన లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలను పూర్తిచేసి, ప్రభుత్వం అందిస్తున్న రూ.5 లక్షలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ కళ్యాణి రాజ్ కుమార్,వార్డు సభ్యులు కృష్ణ,గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, వార్డు సభ్యులు వెంకటేష్,మాజీ సర్పంచ్ రాజేశ్వరి రవి, ఇందిరమ్మ కమిటీ అధ్యక్షులు నారాయణ, గ్రామస్తులు రామచంద్రం,లింగాల కనకయ్య, నర్సింలు, కృష్ణ, కనకయ్య నర్సింలు, అజయ్, నరేష్, కృష్ణ , కనకయ్య,శ్రీను, మల్లయ్యా,శశి కార్యదర్శి శైలేష్, ఫీల్డ్ అసిస్టెంట్ నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు బుక్స్ పంపిణీ చేసిన సర్పంచ్ శ్రీనివాస్ గౌడ్

**అగ్నిధార న్యూస్ సిద్దిపేట జిల్లా**



గజ్వేల్ నియోజకవర్గం జగదేవపూర్ మండల కేంద్రంలోని ఆదర్శ మోడల్ స్కూల్‌లో సోమవారం స్థానిక సర్పంచ్ పనుగట్ల శ్రీనివాస్ గౌడ్ విద్యార్థులకు బుక్స్ పంపిణీ చేశారు. విద్యార్థుల విద్యాభివృద్ధికి అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు ఎల్లప్పుడూ కృషి చేస్తానని ఆయన తెలిపారు. అనంతరం పాఠశాలలో విద్యార్థులకు అందజేస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి, భోజనం నాణ్యత, పరిశుభ్రత ప్రమాణాలపై ఆరా తీశారు. విద్యార్థులకు పోషకాహారంతో కూడిన నాణ్యమైన భోజనం అందేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు బుద్ధ నాగరాజు, గ్రామ పాలకవర్గ సభ్యులు బత్తిని శ్రీనివాస్ దండే వెంకట్ ఎండీ ఇస్మాయిల్ పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

